

## వారానికో రోజు ఆదివారం !

నా ఇష్టమొచ్చినపుడు లేటుగా నిద్రలేవడం యిష్టం. కాఫీ తాగి పేపరు చదివేయడం యిష్టం. తీరుబడిగా స్నానంచేయడం ఇష్టం. మా ఆవిడ చేసే పకోడీ ఇష్టం. అవి తింటూ వివిధ భారతి వినడమిష్టం. పన్నెండింటికి ఘుభ్రంగా భోంచేయడమిష్టం. తాంబూళం బిగించి సిగరెట్టు ముట్టించి తెలుగు వార్తలు వినడం యిష్టం. ఆ పైన పగటి నిద్రలోకి జారుకోవడమిష్టం. మళ్ళీ మూడు గంటలకి లేచి టీ తాగడమిష్టం. పిల్లలూ మా ఆవిడ్తో కేరమ్స్ ఆడటమిష్టం. అయిదింటికి ఇంటిల్లిపాదీ స్నానాలు ముగించి సినిమాకో, షికారుకో వెళ్ళడమిష్టం. ఇన్ని ఇష్టాలను ఇష్టారాజ్యంగా నెరవేర్చుకునే రోజు ఆదివారమంటే మరెంతో ఇష్టం.

నన్నడుగుతే వారానికి మూడో నాలుగో ఆదివారాలుండాలి. అప్పుడు గాని దేశం బాగుపడదు. అదట్లా వుంచేయండి. సరిగ్గా ఆదివారం నాడు ఎవరైనా ఆఫీసుకి వెళ్ళడం చూస్తే, నాకు వాళ్ళమీద అపారమైన జాలి కలుగుతుంది. ఏం చేస్తాం దేవుడిట్లా రాసి పెట్టేడని చిన్నసైజు జాలికూడా కలుగుతుంది.

నేనింత ప్రేమించే ఆదివారాన్ని మా చలపతిరావు చెడ్డ విసుక్కుంటాడు. కేలండర్లో ఆదివారాలు ఎత్తేయాలంటాడు. అదే వారం నాడు ఇంట్లో కూచోడం ఎంత బోరో అతన్నడగండి అరగంట చెబుతాడు. అతను చెప్పేది వింటే మనక్కూడా ఆదివారంమ్మీద వళ్ళు మండిపోతుంది.

సుప్రభాతంతో పాటు ఇంట్లో వాళ్ళావిడ సణుగుడు ప్రారంభమవుతుందట. అదిలేదు, ఇది నిండుకుందనే సాధింపు ఇంట్లో పాత్రల్ని విసిరేస్తూ సాగుతుందట. మార్నింగ్ షోకు వెళ్ళాలనే తమ్ముడి కోరిక ఖరీదు అయిదు రూపాయలు. ఆర్రోజులా మాకు అందకుండా తప్పించుకు పోతున్నావు, ఈ నాడెక్కడికి పోతావో చూస్తామని పిల్లలు బిలబిలమంటూ మంచంచుట్టూ జేరిపోతారు. ఒకడు చెవి పట్టుకుంటాడు. వేరొకడు సాక్షాత్తు చలపతి శరీరంమీద శివతాండవం చేస్తాడు. వాళ్ళ వాళ్ళ డిమాండ్స్ కనుక్కొని అవన్నీ తీర్చిపంపేసరికి తలబొప్పి కడుతుంది.

ఆ వేళకి పక్క వాటాలోని పెద్దమనుష్యులు గళ్ళ లుంగీలతో బ్రష్‌ల మీద పేస్టుంచుకుని బాత్‌రూమ్ దగ్గర చేరిపోయి వాళ్ళ సవాలక్ష సమస్యలను తీవ్రంగా చర్చించుకుంటారు. మధ్యలో అనవసరంగా చలపతిని ఇరికించేసి ప్రాణాలు తీస్తారు. ఈ మధ్య కనబడటం లేదేం గురూగారూ అంటారు. ఇంటికి ఎప్పుడొస్తారు ఎప్పుడు వెళ్ళిపోతారంటూ ఆరాలు తీస్తారు. వాళ్ళ ఆఫీసర్ల గురించి చెప్పి మీ సారెలాంటివాడో వర్ణించమంటారు. జీతాలు ఎప్పుడు పెరుగుతాయో చెప్పమంటారు. పైనేమాత్రం

గిట్టుబాటవుతుందని ప్రశ్నిస్తారు. బజార్లో ధరలెట్లా మండిపోతున్నాయో సోదాహరణపూర్వకంగా వివరిస్తారు. మొన్న ఎలక్షన్లలో ఏ గొడవ ఎల్లా జరిగిందీ చెప్పి రాజకీయాల్లోకి దిగిపోతారు. పది గంటలైనా ఆ మీటింగులు తెమిలినావవు. ఓపిగ్గా వింటే చెత్తకబుర్లతో చావగొడతారు. మొహం తప్పించుకు పోతే గీరంటారు.

ఇంట్లో కొస్తే, ఇల్లాలి సణుగుడు సీరియల్ ఇంకా సాగుతూనే వుంటుంది. ఒక సినిమాలేదు, ఒక సరదాలేదనే విషయంమ్మీద సణుక్కుంటూ తనది పాపిష్టి బతుకనే నిర్ణయానికి వచ్చేస్తుంది. ఈ మధ్యలో అమ్మా, అన్నమే అంటూ వచ్చిన పసి వెధవని రెండు వాయించేసి బేగ్రౌండ్ మ్యూజిక్ ఏర్పాటు చేస్తుంది. చలపతికి బతుకుమీద రోత కలిగేసరికి వేళ పదకొండవుతుంది. రెండు మెతుకులు కతికి మంచమెక్కుదామంటే పిల్లలు మంచంమీద చెడుగుడు ఆడుతుంటారు. ఇల్లొదిలి ఫ్రండ్ కోసం రోడ్డుమీద పడదామనుకుంటే ఎవరిళ్ళల్లో వాళ్ళు తలుపులు బిడాయించుకుని వుంటారు. ఆదివారంపూట ఫ్రండ్సు ఇండ్ల తలుపుల్ని తడితే వాళ్ళేమనుకుంటారోనన్న బెంగతో సాయంత్రం వరకూ చచ్చినట్టు తనింట్లోనే గడుపుతాడు.

అందుకే గురూగారూ. అయ్ హేట్ సన్ డేస్ అన్నాడతను. మొన్నాదివారం మా ఇంటి కొచ్చి, అతను చెప్పేదంతా విన్నాక నాకు జాలి వేసింది. అతన్ని ఓదార్చాలనుకున్నాను. అతన్ని తీసుకుని రోడ్డుమీది కొచ్చేసు. దారి పొడుగ్గునా అతని జీవితాన్ని తిట్టుకుంటూ నడిచాడు. బ్రతుకులో సుఖం లేకపోయిం తర్వాత బతికేం ప్రయోజన మన్నాడు. ఈ చిరాకిట్లా ఎక్కువై పోతే అతిత్వరలో సూసైడ్ చేసుకుంటానన్నాడు. అంత మాట వినపడగానే ఉలిక్కిపడ్డాను. నాకు తోచిన మాటలేవో మాట్లాడి అతని నిస్పృహని దూరం చేద్దా మనుకున్నాను. కానీ ప్రయోజనం లేకపోయింది.

అప్పటికి సూరీడు దిగిపోయి చాలా సేపయింది. చీకటి పడింది. మా నడక ఆటోమేటిగ్గా పానశాలవైపు సాగింది. వాడెవడో ధర్మాను

ఎయిరిండియా రాజామాదిరి వంగి స్వాగతం చెప్పినపుడు చలపతి మొహంలో కళ తళుక్కున మెరిసింది. లోపల చాలా సేపు కూచున్నాం. చలపతిలో నిరాశా, నిస్పృహా, నిట్టూర్పులు మాయమయ్యాయి. నే చావనండి గురూ గారూ! మీరేం భయపడకండి. ఐ లైక్ టు లివ్ అన్నాడు. ఆదివారమ్మీద అందమైన కవిత అల్లేడు. అదంతా పూర్తయ్యేసరికి పది దాటింది. నీరస పడిపోయిన ఫ్రెండులో మళ్ళా ఉత్సాహం చూసినందుకు ఆనందించేను. అతన్ని ఆటోలో వాళ్ళింట్లో దించి మా ఇంటికి చేరేసరికి రాత్రి పదకొండైంది. ఇంటిల్లిపాదీ నాకోసం ఎదురు చూస్తున్నారు. ఏదో చెప్పాలనుకున్నాను గానీ కండీషను బావులేదు. గనక అక్షరం మాట్లాడలేదు. బట్టలు మార్చుకుని భోజనం చేయకుండానే పడగ్గది చేరిపోయేను. చలపతికి ఆదివారం పట్ల ఉత్సాహం కలిగించేనేగానీ తొలిసారిగా నాకు చిరాకు కలిగింది.

ఉదయానికల్లా పిల్లలు బిజీగా వున్నారు. ఒకడు కాగితంమీద పెద్ద పెద్ద అక్షరాలు రాస్తున్నాడు. రెండోవాడు అట్టని చదరంగా కత్తిరిస్తున్నాడు. మూడోవాడు మేకులవీ పుచ్చుకున్నాడు. ఏం చేస్తున్నారని అడగలేదు. స్నానం ముగించి వచ్చేలోగా బోర్డు తయారైపోయింది. ఆ బోర్డులో అక్షరాలు ఇలా రాసి వున్నాయి. "ఈ రోజు ఆదివారం. మా నాన్న మాతో పాటు వుంటాడు. దయచేసి మా నాన్నను ఎక్కడికీ తీసుకెళ్ళొద్దు."